మెదడులో కల్లోలం!

- కోవిడ్ అనంతరం పెరిగిన బ్రెయిన్ స్ట్రోక్ కేసులు
- రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడమే కారణం
- బీపీ, షుగర్ నియంత్రణ లేకపోవడమూ ఒక కారణం
- డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలో ఉచిత చికిత్స
- నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే

గుండెకు ఎలా గుండెపోటు వస్తుందో...మెదడుకు సైతం అలాగే మెదడు పోటు వస్తుంది. దీనినే వైద్యపరిభాషలో బ్రెయిన్ స్ట్రోక్ అంటారు. సడన్‌గా మూతి వంకర పోవడం, కాళ్లు, చేతులు సచ్చుబడిపోవడం, వంకర్లు తిరగడం, కళ్లు తిరిగి కింద పడిపోవడం వంటి లక్షణాలన్నీ దీని కిందకే వస్తాయి. లక్షణాలను ముందుగా గుర్తించి సకాలంలో వైద్యుల వద్దకు వెళితే తీవ్ర నష్టం కాకుండా కాపాడుకోవచ్చు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు గాను ప్రతి సంవత్సరం అక్టోబర్ 29వ తేదీన వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డేను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.



కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 5 శాతం మంది బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. అంటే దాదాపు రెండున్నర లక్షల మంది ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు లెక్క. ఈ వ్యాధికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు నంద్యాలలోని సర్వజన వైద్యశాలలోనూ న్యూరోఫిజీషియన్లు, జనరల్ ఫిజీషియన్లు చికిత్స అందిస్తున్నారు. వీరితో పాటు ప్రైవేటు రంగంలోనూ ప్రస్తుతం 30 మందికి పైగా న్యూరాలజిస్టులు, 150 మందికి పైగా ఉన్న జనరల్ ఫిజీషియన్లు స్ట్రోక్ బాధితులకు చికిత్స చేస్తున్నారు. ప్రధానంగా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో ఈ వ్యాధికి ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయి. వ్యాధిలక్షణాలు కనిపించిన నాలుగున్నర గంటల్లో సమీప నెట్‌వర్క్ ఆసుపత్రికి వెళితే చికిత్స అందుకుని ప్రమాదం నుంచి బయటపడవచ్చు. ఈ క్రమంలో ఖరీదైన మందులు, చికిత్సను ఆయా ఆసుపత్రుల్లో ఉచితంగా అందించాల్సి ఉంది. అయితే, కొన్ని ఆరోగ్యశ్రీ ఉన్న ఆసుపత్రులు ప్యాకేజి సరిపోదనే భావనతో తమ వద్ద చికిత్స లేదని వెనక్కి పంపిస్తున్నారు. ఈ కారణంగా స్ట్రోక్ బారిన పడిన మెడికల్ కేసులను అమీలియో, గాయత్రి ఆసుపత్రుల్లో మాత్రం చికిత్స చేస్తున్నారు. స్ట్రోక్‌లో ఆపరేషన్ అవసరమైన కేసులను మిగిలిన ఆసుపత్రుల్లో చికిత్స చేస్తున్నారు. కాగా ఒక్క కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనే ప్రతి వారం స్ట్రోక్ బాధితుల సంఖ్య 160 నుంచి 180 వరకు ఉంటోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజుకు కనీసం 30 మంది చికిత్స అందుకుంటున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణాలు

- బీపీ, షుగర్ వ్యాధులు నియంత్రణలో లేకపోవడం
- స్థూలకాయం కారణంగా ఒంట్లో కొవ్వుస్థాయిలు(కొలెస్ట్రాల్) పెరిగిపోవడం
- యువతలో పనిలో ఒత్తిడి, ఇష్టానుసారంగా స్మోకింగ్, మద్యపానం చేయడం
- జీవనశైలిలో మార్పులు, శారీరక శ్రమ లేకపోవడం
- గుండెజబ్బులకు మందులు సరిగ్గా వాడకపోవడం వంటివి స్ట్రోక్‌కు దారి తీస్తాయి.
- పుట్టుకతో జన్యుపరమైన లోపాల కారణంగా రక్తం గడ్డకట్టే గుణం ఉన్న వారికి స్ట్రోక్ వచ్చే ప్రమాదముంది.

బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు

- అకస్మాత్తుగా ముఖం, చేయి, కాలులో తిమ్మిర్లు లేదా బలహీనంగా అనిపించడం
- అకస్మాత్తుగా మాట్లాడటంలో ఇబ్బంది, విషయాలు అర్థం చేసుకోలేకపోవడం
- ఒకటి లేదా రెండు కంటిచూపులో ఇబ్బందులు ఏర్పడటం, నడవడానికి ఇబ్బంది, సరిగ్గా బ్యాలన్స్ చేసుకోలేకపోవడం
- కారణం లేకుండా విపరీతమైన తలనొప్పి

కోవిడ్‌తో పెరిగిన స్ట్రోక్ బాధితులు

కోవిడ్-19 పోతూ పోతూ ఎక్కువ మందికి స్ట్రోక్‌కు గురి చేసి వెళ్లింది. ఈ వ్యాధి కారణంగా మనిషి శరీరంలోని రక్తనాళాల్లో పలు చోట్ల రక్తం గడ్డలు (థ్రాంబోసిస్) కట్టుకుని ఉంటోందని, కొన్నిసార్లు ఇవి మెదడుకు వెళ్లే రక్తనాళాల్లో బ్లాక్ కావడం వల్ల స్ట్రోక్ వస్తోందని వైద్యులు చెబుతున్నారు. కోవిడ్ అనంతరం చాలా మంది వారికి తెలియకుండానే దీని బారిన పడుతున్నారు. ఈ కారణంగా కోవిడ్ ముందుతో పోలిస్తే ఆ తర్వాత స్ట్రోక్ బాధితుల సంఖ్య మూడింతలు పెరిగిందని వైద్యులు భావిస్తున్నారు.

ఆరోగ్యశ్రీలో ఐదేళ్లలో చికిత్స పొందిన స్ట్రోక్ బాధితులు

సంవత్సరం	మొత్తం కేసులు	క్లెయిమ్ అయిన మొత్తం రూ.
2019-2020	368	89.17లక్షలు
2020-2021	443	97.16లక్షలు
2021-2022	506	1.02కోట్లు
2022-2023	535	1.25కోట్లు
2023 ఇప్పటి వరకు	324	59.8లక్షలు

ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి



బ్రెయిన్ స్ట్రోక్‌కు సంప్రదాయ వైద్యంతో పాటు ఆధునిక చికిత్సలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. స్ట్రోక్ వచ్చిన నాలుగున్నర గంటల్లోపు ఆసుపత్రికి వస్తే థ్రాంబోలైసిస్ అనే ఇంజెక్షన్ ఇస్తాము. ఇది వెంటనే నరాల్లో గడ్డకట్టిన రక్తాన్ని పలచన చేసి మెదడుకు రక్తసరఫరాను పునరుద్ధరిస్తుంది. ఆ తర్వాత వస్తే మాత్రం మెదడులో న్యూరాన్స్ తగ్గిపోతాయి. ఈ కారణంగా మెదడుకు రక్తసరఫరా తగ్గిపోయి ఇబ్బంది ఏర్పడుతుంది.
–డాక్టర్ నాగసురేష్, న్యూరోఫిజీషియన్, కర్నూలు

ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స



బ్రెయిన్ స్ట్రోక్‌కు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత చికిత్స లభిస్తోంది. చికిత్స అనంతరం రోగి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే సమయంలో ఆసరా మొత్తాన్ని కూడా నేరుగా వారి ఖాతాలో జమ చేస్తున్నాము. బ్రెయిన్‌స్ట్రోక్ చికిత్సకు ఏ ఆసుపత్రిలోనూ ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన పనిలేదు. ఎక్కడైనా డబ్బులు అడిగితే పెద్దాసుపత్రిలోని మా కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.
–డాక్టర్ భాస్కరరెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

క్లుప్తంగా

రక్తదానంపై అపోహలు వీడండి



ఏపీఎస్పీ రెండవ పటాలంలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

కర్నూలు : రక్తదానంపై అపోహలు వీడి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి రక్తదానం చేయాలని హోంగార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మేకల మహేష్ కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఏపీఎస్పీ కర్నూలు రెండో పటాలంలోని యూనిట్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరంతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. పటాలం సిబ్బంది పెద్ద ఎత్తున ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకున్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఏపీఎస్పీ బ్యాండ్ బృందం వెంకటరమణ కాలనీలో రోడ్‌షో నిర్వహించి కేఎంసీ పార్కులో బ్యాండ్ మాస్టర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో బ్యాండ్ మ్యూజిక్ షో నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అడిషనల్ కమాండెంట్ మహబూబ్ బాషా, అసిస్టెంట్ కమాండెంట్ రమణకుమార్‌తో పాటు పటాలం సిబ్బంది, కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడూ పనిచేయనున్న విద్యుత్ బిల్లు కేంద్రాలు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఆదివారం కూడా పూర్తి స్థాయిలో పనిచేస్తాయని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని వినియోగదారులు తమ సమీపంలోని చెల్లింపు కేంద్రాల్లో లేదా ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్, ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి సురక్షిత యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చునని సూచించారు.

ఈ-క్రాప్ బుకింగ్ జాబితాల పరిశీలనకు నేడు ఆఖరు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ-క్రాప్ బుకింగ్ ముసాయిదా జాబితాల పరిశీలన నేటితో ముగియనుంది. ఖరీఫ్ సాధారణ సాగు 10.42 లక్షల ఎకరాలు ఉండగా...10,17,601 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటలను 100 శాతం ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. పంటల నమోదు ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీల కోసం ఈ నెల 26 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో సోషల్ ఆడిట్‌కు పెట్టిన విషయం తెలిసిందే. కాగా దాదాపు 3.26 లక్షల మంది రైతులు 9.74 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటలను రైతులు ఈ-కేవైసీతో ధ్రువీకరించారు. ప్రతి రైతు ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలు, విస్తీర్ణం తదితర వాటిని విధిగా చెక్ చేసుకోవాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి తెలిపారు. శనివారం ఆయన కర్నూలు మండలంలో జరిగిన గ్రామ సభలో పాల్గొన్నారు.

1న ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 1 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి జూనియర్స్ విభాగంలో బాల బాలికలకు జంప్ రోప్ క్రీడాంశంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జంపు రోప్ కార్యదర్శి బి. జోసెఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 87907083 91 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జీవనోపాధుల మెరుగుకు చర్యలు

కర్నూలు (టౌన్) : పట్టణాల్లో పొదుపు గ్రూపు మహిళల జీవనోపాధుల మెరుగుకు చర్యలు తీసుకోవాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల అన్నారు. శనివారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో సీఎంఎం, జీవనోపాధుల స్పెషలిస్టులు, టీఎంసీ, మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పరిపాలన అధికారి ఆసీఫ్, జిలానీ, టీఎంసీ సుధాకర్, మహిళా మార్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

రంగస్థల నటుడు సుభాన్ సింగ్ కన్నుమూత



కర్నూలు కల్చరల్: ప్రముఖ రంగస్థల, టీవీ నటులు సుభాన్ సింగ్ వృద్ధాప్య సమస్యలతో శుక్రవారం రాత్రి తన స్వగృహంలో కన్నుమూశారు. రాయలసీమ ముఠా కక్షలపై రూపొందించిన పులిస్వారీ నాటకంలో మారెప్ప పాత్రను పోషించి రాష్ట్ర వ్యాప్తంగా 150 ప్రదర్శనలు ఇచ్చారు. దాదాపు 40 సంవత్సరాలు రంగస్థలంలో జీవించిన ఆయన అనేక టీవీ సీరియల్స్‌లో ప్రముఖ పాత్ర పోషించారు. విజేత ఆర్ట్స్, అభినయ ఆర్ట్స్, లలిత కళా సమితి నిర్వహించిన సాంఘిక నాటకాలు, బావా ఎప్పుడు వచ్చితివి, కుర్చీ, పులి స్వారీ వంటి నాటకాల్లో ఆయన నటించిన పాత్రలకు ఎన్నో బహుమతులు, అవార్డులు లభించాయి. సుభాన్ సింగ్ మృతి పట్ల టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, విశ్వ కళా సమితి అధ్యక్షుడు లక్ష్మన్న, పులి స్వారీ నాటక నటులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు, క్రిష్టఫర్, లక్ష్మీకాంతరావు తదితరులు ఆయన పార్థివ దేహానికి పూలమాలల సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

సీఎంఈలతో జ్ఞానసముపార్జన



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): నిరంతర వైద్య విజ్ఞాన సదస్సుల ద్వారా వైద్యులు, వైద్య విద్యార్థుల్లో జ్ఞానసముపార్జన జరుగుతుందని కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ చెప్పారు. మూత్రాశయంలో వచ్చే క్యాన్సర్ గురించి శనివారం కర్నూలు మెడికల్ కాలేజిలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు(సీఎంఈ) నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యంతో పాటు వైద్య విద్యార్థులకు బోధన కూడా ముఖ్యమన్నారు. పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ యురాలజి విభాగం వారు రాష్ట్రంలో చేస్తున్న ఆధునిక శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నారని అభినందించారు. అనంతరం హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సీనియర్ యూరో ఆంకాలజిస్టు డాక్టర్ రాకేష్ శర్మ, కర్నూలు మెడికల్ కాలేజికి చెందిన డాక్టర్ సేపూరి బాలరవితేజ, డాక్టర్ ప్రకాష్, డాక్టర్ సుధీర్‌కుమార్ బ్లాడర్‌లో క్యాన్సర్ చికిత్సల అప్‌డేట్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, యురాలజి విభాగాధిపతి డాక్టర్ సీతారామయ్య, సీనియర్ యురాలజిస్టు డాక్టర్ ఏవీకే రెడ్డి పాల్గొన్నారు.

శంకరాస్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే

కర్నూలు సిటీ: శ్రీ శంకరాస్ డిగ్రీ కాలేజీలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలేజీ చైర్మన్ బి.తిమ్మయ్య, డైరెక్టర్ డా.హరికిషన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. చదువులో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసే వరకు ఉద్యమం



మాట్లాడుతున్న రవీంద్ర విద్యా సంస్థల అధినేత

కర్నూలు సిటీ: కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసేంత వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ప్రకటించారు. శనివారం కడప స్టీల్ ప్లాంట్ సాధన, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ ఉద్యమ కార్యాచరణపై సలాం ఖాన్ భవనంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణారెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు ఆనంద్‌బాబు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. రాయలసీమ జిల్లాల యువతకు ఉపాధి అవకాశాలు లభించాలంటే కడపజిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు.అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేయరాదన్నారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి వెంకటస్వామి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, బీసీ సంఘం నాయకులు శేషఫణి, పీడీఎస్‌యూ నాయకులు భాస్కర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడ్ పాల్గొన్నారు.

ఆర్‌టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం

కర్నూలు(అగ్రికల్చర్):కావలిలో ఆర్‌టీసీ బస్ డ్రైవర్‌పై దాడి హేయమైన చర్య అని దీనిని ప్రతి ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉందని ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు, ఆర్ అండ్‌బి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీ రమణ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

కర్నూలు(రాజ్‌విహార్): నెల్లూరు జిల్లా కావలి దగ్గర ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆ సంఘం నాయకులు నరసింహులు, రాధాకృష్ణ, రఫీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దుండగులను అరెస్టు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఆర్‌టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలని కోరుతూ కార్మిక సంఘాలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టాయి. సీఐటీయూ ఓల్డ్ సిటీ ఆధ్వర్యంలో లైట్ మోటార్ వర్కర్స్ యూనియన్, రాయలసీమ యాక్టింగ్ డ్రైవర్స్ యూనియన్, ఏపీ ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు విజయ్, మహ్మద్ హాజరై మాట్లాడుతూ..ఇలాంటి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వారి కారుకు సైడు ఇవ్వలేదని దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి ఘటన లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పేదలకు ఆరోగ్య భరోసా

- ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



శిబిరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం స్థానిక 43 వ వార్డు పరిధిలోని 113 వ సచివాలయం ఇందిరాగాంధీ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని ఎమ్మెల్యే ప్రారంభించి అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. రోగులు, స్థానికులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రస్తుతం వైద్య శిబిరంలో అన్ని ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు అవసరమైన వారికి మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ సాతర్ల రాజేష్ బాబు, వహీదా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం కార్యక్రమం పేదలకు వరం లాంటిదని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన స్థానిక డాక్టర్స్ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలోని అరుంధతినగర్‌లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని తనిఖీ చేశారు. హెల్ప్‌డెస్క్, ల్యాబ్‌పరీక్షలు, మెడికల్ ఆఫీసర్, మందులు ఇచ్చే కౌంటర్లు పరిశీలించారు. పిల్లలకు టీకాలు వేసిన వివరాలను ఆర్‌సీహెచ్, యూవిన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి సూచించారు.

జగనన్న పథకాలు ఆదర్శం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం స్థానిక 44వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీతారామ్ నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అలాగే వారి సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్లలో 99శాతం హామీలు అమలు చేసిన ఘనత తమ సీఎంకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేశ్వరరెడ్డి, గోశాల చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, ప్రసాద్, శ్వేతారెడ్డి, ఖాజా, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి





వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, జెడ్పీలో చైర్మన్ పాపిరెడ్డి, అధికారులు..

కర్నూలు(అర్బన్): రామాయణ గ్రంథ కర్త మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మహర్షి వాల్మీకి చిత్ర పటాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. స్థానిక గౌరీ గోపాల్ హాస్పిటల్ సర్కిల్‌లో ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహానికి జిల్లా కలెక్టర్ డా.జి. సృజన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంత రం కర్నూలు ఎంపీ డా.ఎస్ సంజీవ్‌కుమార్, కర్నూ లు, కోడుమూరు ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, డా.జరదొడ్డి సుధాకర్, నగర మేయర్ బీవై రామయ్య, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆదిమూలపు సతీష్, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి. వెంకటలక్ష్మమ్మ తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రీజినల్ ఇన్‌చార్జ్ గాజుల శ్వేతారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, బీసీ సెల్ కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, మైనారిటీ విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు యూనస్‌భాష, బత్తుల లక్ష్మీకాంతయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, డీకే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో ...

జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి తదితరులు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు జీవేంద్ర, మురళీమోహన్‌రెడ్డి,సరస్వతమ్మ, బసవశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆశయ సాధనకు కృషి

కర్నూలు(రాజ్‌విహార్): వాల్మీకి మహర్షి ఆశయ సాధనకు కృషి చేస్తామని కర్నూలు మేయర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నా రు. శనివారం వాల్మీకి జయంతి సందర్భంగా స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, డాక్టర్ సుధాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, కార్పొరేటర్ శ్వేతారెడ్డి, పార్టీ నాయకులు మద్దయ్య, ఆదిమూలపు సతీష్, హనుమంతరెడ్డి, ధనుంజయ ఆచారి, గౌతం, కృష్ణుడు, రాజశేఖర్, యూనుస్ తదితరులు పాల్గొన్నారు. **కర్నూలు కల్చరల్:** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన వాల్మీకి జయంతి వేడుకల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, కార్పొరేటర్ శ్వేతారెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, నాయకులు బత్తుల లక్ష్మీకాంతయ్య, పాల్గొన్నారు.

- బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీనాయుడు, ఓబీసీ మోర్చా సభ్యులు వీరప్ప, మంజునాథ్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు. వాల్మీకి విగ్రహానికి బీజేపీ నాయకులు హరీష్‌బాబు, గణేష్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, నగర అధ్యక్షుడు మద్దిలేటి, రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు, రాష్ట్ర సహ కార్యదర్శి కోటేశ్వరరావు, కోశాధికారి సందడి మహేష్, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, నగర కార్యదర్శి నాగరాజు, నగర కన్వీనర్ భగీరథ, తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

కమిటీ చైర్మన్‌గా రాయపాటి

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ సేవా సంస్థ అసోసియేషన్ ఆఫ్ అలియన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్‌గా అల్లాయ్ అండ్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్‌గా ఎంపిక చేసిన క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు వి.ఎం.రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పీస్ రేటు విధానాన్ని రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్) : విద్యుత్ మీటర్ రీడింగ్ వర్కర్లకు పీస్ రేటు విధానాన్ని రద్దు చేయాలని ఏపీ మీటర్ రీడింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజు అన్నారు. శనివారం కార్మిక, కర్షక భవన్ నుంచి చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లడానికి ప్రయత్నించిన విద్యుత్ మీటర్ రీడింగ్ వర్కర్లను పోలీసులు అడ్డుకున్నారు. ఈనేపథ్యంలో తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ప్రజా రక్షణ భేరీని విజయవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్): అసమానతలు లేని అభివృద్ధి కోసం ఈనెల 30వ తేదీన ఆదోనిలో చేపట్టే ప్రజా రక్షణ భేరీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. సీపీఎం నాయకులు సుధాకరప్ప, మహ్మద్ షరీఫ్, సాయిబాబా, ప్రభాకర్, రామకృష్ణ, ఆర్.చంద్ర, ఎం.రాజశేఖర్, మాజీ కార్పొరేటర్ ఈపుల్లారెడ్డి తదితరులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇంటిటా ప్రచారం నిర్వహించారు.

పశ్చిమలో ఉపాధి పనిదినాలు పెంచాలి

- తీవ్ర వర్షాభావ పరిస్థితులను సీఎస్‌కు వివరించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్) : జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వలసల నివారించేందుకు ఉపాధి హామీ పథకంలో ఎక్కువ పని దినాలను కేటాయించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డిని కోరారు. శనివారం సీఎస్ విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో స్పందన అంశాలపై సమీక్షించారు.

పునరుద్ధరణ పనులను వేగవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్) : కలెక్టరేట్‌లో జరుగుతున్న పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నిర్మాణ పనులను ఒక బ్లాక్‌లో పూర్తి చేసిన తరువాత మరో బ్లాక్‌లో చేపట్టాలన్నారు. అప్పుడు కార్యాలయాల నిర్వహణకు ఇబ్బందులు ఉండవని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో పునరుద్ధరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరుచేసిందన్నారు. రెవెన్యూ విభాగంలో రికార్డుల కోసం ప్రత్యేక గదిని ఏర్పాటు చేసుకోవాలని ఏఓ శ్రీనాథ్‌ను ఆదేశించారు. ఆమె వెంట ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, ఈఈ సురేష్, అదనపు మునిసిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ జి.సృజన

అయోడిన్ లోపంతో థైరాయిడ్

కర్నూలు(హాస్పిటల్): శరీరంలో అయోడిన్ లోపిస్తే హైపో థైరాయిడ్ వ్యాధి వస్తుందని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఎయిడెడ్ సెయింట్ జోసఫ్ బాలికల హైస్కూల్‌లో శనివారం అయోడిన్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల వచ్చే రుగ్మతల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హలీం, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, మోడి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన అవసరం

కర్నూలు (హాస్పిటల్) : బ్రెయిన్ స్ట్రోక్/పక్షవాతం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ ఎస్.సంజీవ్‌కుమార్ చెప్పారు. ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ హాజరై మాట్లాడారు. న్యూరోఫిజీషియన్ డాక్టర్ నాగ సురేష్, న్యూరో సర్జన్ డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, కార్డియాలజిస్టు డాక్టర్ చైతన్యకుమార్, ఆర్థోపెడిస్ట్ డాక్టర్ కిరణ్‌కుమార్, హాస్పిటల్ వైస్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ నీలారెడ్డి పాల్గొన్నారు.